ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్
కోనసీమ జిల్లా వార్తలు
ఆదివారం 18 ఆగస్టు 2024 | 5






అమలాపురంలో కలెక్టర్‌కు వినతిపత్రం

గుండె కోత

నదీపాతానికి గురవుతున్న లంక భూములు

ప్రతిఏటా వరదల సమయంలో ఆవేదనే.. పట్టించుకోని ప్రభుత్వాలు



పి.గన్నవరం మండలం మొండెపులంకలో నదీపాతానికి గురవుతున్న కొబ్బరి తోటలు



అయినవిల్లి మండలంలో గోదారిలో కొబ్బరి చెట్టు

50 సెంట్ల భూమికి 25 సెంట్లు మిగిలింది



మాకు లంకలగన్నవరం శివారు జొన్నలంక, మొండెపులంక సరిహద్దు ప్రాంతంలో 50 సెంట్ల కొబ్బరి తోట ఉండగా ప్రతి ఏడాది వరదల సమయంలో నదీకోతకు గురై ప్రస్తుతం 25 సెంట్ల భూమి మిగిలింది. గత 5 ఏళ్లుగా ఈ ప్రాంతంలో కోత ఎక్కువగా ఉంది. గోదావరిలో ఏర్పడిన దిబ్బలు వల్ల దిగువకు వెళ్లే నీటివేగం స్వరూపం మార్చుకోవడంతో కోత ఎక్కువైంది. ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపాలి.

కుడిపూడి శ్రీను, రైతు లంకలగన్నవరం

● (పి.గన్నవరం)

పి.గన్నవరం నియోజకవర్గంలో పి.గన్నవరం, మామిడికుదురు, అయినవిల్లి మండలాలతో పాటు అంబాజీపేట మండలంలో కొంతమేర లంక గ్రామాలు ఉన్నాయి. పి.గన్నవరం నియోజకవర్గం చుట్టూ గోదావరి నదీపాయలు (వశిష్ట, వైనతేయ, గౌతమి) ప్రవహించడంతో వరదల సమయంలో ఈ ప్రాంత వాసులు ఎక్కువ శాతం నష్టాలు చవిచూడాల్సి వస్తుంది. ముఖ్యంగా పంటలతో పాటు పంట పొలాలను సైతం కోల్పోవాల్సి వస్తోంది. గోదావరి తీర ప్రాంతంలో ప్రతి ఏడాది వందలాది ఎకరాల భూములు నదీకోతకు గురై రైతుకు గుండెకోతను మిగులుస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం హడావిడిగా టెక్నికల్ అడ్వయిజర్ కమిటీని ఏర్పాటు చేసి గోదావరి తీర ప్రాంతాలను పరిశీలన చేయించి సంబంధిత నివేదికలను తీసుకుంది. ఆ తర్వాత అవి బుట్టదాఖలయ్యాయి. కోనసీమ జిల్లాతో పాటు ఇతర జిల్లాలతో పోలిస్తే వరదల సమయంలో పి.గన్నవరం నియోజకవర్గానికే అధిక మొత్తంలో నష్టం వాటిల్లితోంది.

గోదారమ్మ ఒడిలోకి విలువైన భూములు వెళ్లిపోతున్నా చూస్తూ ఉండడమే కానీ ఏమీ చేయలేని పరిస్థితి ఆ ప్రాంత రైతులది.. పోనీ నదీకోత నివారణకు ప్రభుత్వం ఏదైనా చేస్తుందా అంటే ఏళ్ల తరబడి గోదావరికి భూములను వదిలేయడం తప్పా ఏమీ చేయడం లేదు. ఈ పరిస్థితుల్లో రైతులకు ఆవేదన, ఆందోళన తప్పా ఇంకేమి మిగలడం లేదు. ఐదేళ్లకోసారి మారే ప్రభుత్వంపై ఆశలు పెట్టుకుని ఎదురుచూస్తున్నారు..



మొండెపులంకలో గోదారమ్మ ఒడిలో కొబ్బరి చెట్లు

కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

వైసీపీ ప్రభుత్వం దిగిపోయి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రైతులకు మళ్లీ ఆశలు చిగురించాయి. ఈ ప్రభుత్వంలోనైనా తమ చిరకాల ఆకాంక్ష నెరవేరుతుందేమోనని వారు భావిస్తున్నారు. ప్రభుత్వం, అధికారుల దృష్టికి మళ్లీ ఇంకోసారి సమస్యను తీసుకెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

రూ.358 కోట్లతో ప్రతిపాదనలు

నియోజకవర్గ వ్యాప్తంగా నదీకోత నివారణ ప్రాంతాలలో గ్రోయిన్స్ నిర్మాణానికి రూ.358 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించారు. వైనతేయ ఎడమ గట్టుకు సంబంధించి 4.8 కిలోమీటర్ల మేర నదీకోత నివారణకు రూ.166 కోట్లు, వైనతేయ కుడిగట్టుకు సంబంధించి రూ.82 కోట్లుతోను, గౌతమి కుడిగట్టుకు సంబంధించి 2.8 కిలోమీటర్ల మేర రూ.110 కోట్లతోను సంబంధిత అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించారు. అయితే పి.గన్నవరం మండలం మొండెపులంకలో నదీకోత నివారణకు అధికారులు ఇంకా ప్రతిపాదనలు పంపించలేదు

భూములు కోల్పోతున్న లంక గ్రామాలు

పి.గన్నవరం మండలంలో వైనతేయ ఎడమ గట్టు వైపు ఉన్న వై.కొత్తపల్లి, ఆర్.ఏనుగుపల్లి, కె.ముంజవరం, మొండెపులంక, గంటిపెదపూడి, అంబాజీపేట మండలంలో వాకలగరువు, అయినవిల్లి మండలంలో గౌతమి కుడిగట్టు పరిధిలో యలకల్లంక, కొండుకుదురులంక, ఏటిమెరక, శానపల్లిలంక, వీరవల్లిపాలెం, మామిడికుదురు మండలంలో వైనతేయ కుడిగట్టు పరిధిలో అప్పనపల్లి, పెదపట్నంలంక, బి.దొడ్డవరం, పాశర్లపూడిలంక, ఆదుర్రు, మోరిపోలం తదితర ప్రాంతాలలో జిరాయితీ భూములతో పాటు పట్టా భూముల్లో ఉన్న కొబ్బరి తోటలు నదీపాతానికి గురవుతున్నాయి. ప్రతి ఏడాది వందల ఎకరాల్లో భూములు నదీపాతానికి గురికావడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రతి ఏడాది ప్రభుత్వానికి అంచనాలు పంపించినప్పటికీ ప్రయోజనం శూన్యం.

మాకేదీ రక్షణ?

జిల్లా వ్యాప్తంగా వైద్య సిబ్బంది ఆందోళన



ముమ్మిడివరంలో మానవహారం

వివరాలు..8లో

కోల్‌కతాలోని ఆర్జీకర్ ప్రభుత్వ వైద్య కళాశాలలో పీజీ వైద్య విద్యార్థినిపై జరిగిన అమానవీయ ఘోరాన్ని ఖండిస్తూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో శనివారం జిల్లా వ్యాప్తంగా వైద్య సిబ్బంది నిరసన బాట పట్టారు. డాక్టర్లు, ఇతర వైద్య సిబ్బంది ర్యాలీలు నిర్వహించి మానవహారాలుగా ఏర్పడ్డారు. అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు.



అమలాపురం కిమ్స్‌లో కొవ్వొత్తుల ప్రదర్శన



మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్, పక్కన జేసీ నిషాంతి

వికసిత్ ఆంధ్ర-2047 విజన్ వైపు అడుగులు పడాలి

కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా వికసిత్ ఆంధ్ర-2047 విజన్‌ను రూపొందించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. రాబోయే ఐదేళ్లకు కార్యాచరణను సిద్ధం చేయాలన్నారు. కలెక్టరేట్‌లో శనివారం ఆయా శాఖల అధికారులతో జిల్లా యాక్షన్ ప్లాన్ తయారు చేసేందుకు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2047 లోగా 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా భారతదేశం అవతరించాలని లక్ష్యంగా నిర్దేశించారన్నారు. దీనిలో కీలక భాగస్వామిగా మార్చేందుకు వికసిత్ ఏపీ విజన్ డాక్యుమెంట్-2047ను రూపొందించనున్నట్టు తెలిపారు. ఈ నెల 21 నుంచి 31 వరకు రాష్ట్రస్థాయిలో సంబంధిత హెచ్‌ఓడీలు సమావేశాలు నిర్వహించి తమ శాఖల ప్రణాళికలను రూపొందించేందుకు దిశానిర్దేశం చేస్తారన్నారు. జిల్లా కార్యాచరణ ప్రణాళికను రూపొందించే క్రమంలో భాగంగా శాఖల వారీగా ప్రతీ ఏటా 15 శాతం వృద్ధి రేటు సాధించే విధంగా ఐదేళ్లకు ప్రణాళికలను రూపొందించాలన్నారు. మండల స్థాయి నుంచి కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలన్నారు. తలసరి ఆదాయాన్ని రెట్టింపు చేయడంతో పేదరికం నిర్మూలించడం ద్వారా అభివృద్ధి ఫలాలను వెనుకబడిన వర్గాలకు తీసుకువెళ్లేలా ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, సీపీవో వెంకటేశ్వర్లు, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, వ్యవసాయశాఖ జేడీ ఓలేటి బోసుబాబు పాల్గొన్నారు.

సోలార్ రూఫ్‌టాప్‌తో ఆదా

ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకం కింద పేద, మధ్యతరగతి కుటుంబాలు తమ ఇళ్లపై సోలార్ రూఫ్‌టాప్‌లను నిర్మించుకోవడం ద్వారా 300 యూనిట్ల వరకు విద్యుత్ ఖర్చును ఆదా చేసుకోవచ్చని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో శనివారం ఏర్పాటుచేసిన ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన్ క్యూఆర్ కోడ్ సెల్ఫీ స్టాండును ఆయన పరిశీలించారు. రిజిస్ట్రేషన్ చేసుకునే ప్రక్రియను ఆయన పరిశీలించారు. గృహ వినియోగదారులు తమ ఇళ్లపై కేంద్ర ప్రభుత్వం రాయితీతో అందించే సోలార్ ప్యానళ్లను ఏర్పాటు చేసుకోవడం ద్వారా బిల్లు ఆదా అవుతుందన్నారు. కిలో వాట్ సామర్థ్యం గల సోలార్ ప్యానల్‌కు రూ.30 వేలు, రెండు కిలో వాట్‌లకు రూ.60 వేలు, మూడు కిలోవాట్‌లకు గరిష్ఠంగా రూ.78వేలు కేంద్ర ప్రభుత్వం రాయితీగా అందిస్తుందన్నారు. అతి తక్కువ వడ్డీకే బ్యాంకుల నుంచి రుణాలు పొందవచ్చునని తెలిపారు. సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు కోసం టోల్ ఫ్రీ నంబరు 1917కు కాల్ చేయాలన్నారు. ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రవికుమార్, డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.




అయినవిల్లిలో చవితి ఉత్సవాలకు పందిరి రాట ముహూర్తం

అయినవిల్లి, ఆగస్టు 17: అయినవిల్లి శ్రీసిద్ధి వినాయక ఆలయంలో శనివారం వినాయక చవితి ఉత్సవాల ఏర్పాట్లకు శ్రీకారం చుట్టారు. పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పందిరి రాట ముహూర్తం చేశారు. తొలుత శ్రీసిద్ధి వినాయకుని దర్శించుకుని ఆయన ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ మర్యాదలతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో జనసేన అధ్యక్షుడు పోలిశెట్టి రాజేష్, టీడీపీ అధ్యక్షుడు చిట్టూరి శ్రీనివాస్, సలాది పుల్లయ్యనాయుడు, కాకర శ్రీనివాస్, సరెళ్ల సత్యనారాయణ, మేడిద దుర్గాప్రసాద్, దంగేటి వెంకటరమణ, కుడుపూడి బుజ్జి, పెన్మెత్స సూర్యనారాయణవర్మ పాల్గొన్నారు.



వాడపల్లి ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు

వాడపల్లి వెంకన్న ఆలయం కిటకిట



వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తజనం
ప్రత్యేక పూజలు, అభిషేకాల నిర్వహణ

ఆత్రేయపురం, ఆగస్టు 17: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం శ్రావణ శనివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తజనంతో కిటకిటలాడింది. వేకుమజామునే స్వామి వారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మి హోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరువీధులలో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు తులాభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. అనంతరం రాత్రి వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.34.68 లక్షలు లభించినట్టు ఉప కమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.



వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు

శనేశ్వర ఆలయంలో రద్దీ

కొత్తపేట, ఆగస్టు 17: పౌర్ణమి ముందు త్రయోదశిని పురస్కరించుకుని మందపల్లి మందేశ్వర(శనేశ్వర) ఆలయానికి రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ప్రాతఃకాల అర్చన అనంతరం స్వామి వారి సర్వ దర్శనాలకు క్యూ కట్టారు. అనంతరం తైలాభిషేకాలు జరిపారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ దంపతులు స్వామివారి ఆలయానికి విచ్చేశారు. ఆలయ అర్చకులు శ్రీరామమూర్తి ఆధ్వర్యంలో ఈవో కె.విజయలక్ష్మి పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకుని కలెక్టర్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు కలెక్టర్ దంపతులకు ఆశీర్వచనాలు అందించారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.14,47,710 ఒకరోజు ఆదాయం లభించినట్టు ఆలయ సహాయ కమిషనర్, ఈవో కె.విజయలక్ష్మి తెలిపారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు.



ఆకాశంలో అపురూపాలు!

ఆకాశమంటేనే అద్భుతం. నింగి వైపు చూసిన ప్రతిసారీ సరికొత్తగా కనిపిస్తుంటుంది. ఒక్క హరివిల్లు కనిపించినప్పుడు అదిగో సప్త వర్ణ శోభితమని మురిసిపోతుంటాం కానీ, ఈ చిత్రాలు చూశాక ప్రతి రోజూ, ప్రతి రేయి అపురూపమే అనుకోకుండా ఉండలేం. మొదటి చిత్రం.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జిల్లా మండపేట పట్టణంలో నీలాకాశంలో తెలుపు నలుపు సోయగాలు.. రెండోది.. అదే పట్టణంలో రాత్రి విద్యుత్ వెలుగుల మధ్య నుంచి అచ్చమైన నీలాకాశం.. మూడోది.. ఆకాశంలో మేఘాలు రెండు నీటి గుర్రాల ఆకృతిలో కనువిందు చేసిన దృశ్యం. ఒక నిమిషంపాటు ఉన్న ఈ దృశ్యం తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలం తీపర్రు గోదావరి తీరంలోనిది. **- మండపేట/పెరవలి**

శృంగారవల్లభస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తజనం



పెద్దాపురం, ఆగస్టు 17: కాకినాడ జిల్లా పెద్దాపురం మండలంలోని తిరుపతి శృంగార వల్లభస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు తెల్లవారుజాము నుంచే బారులు తీరారు. ప్రత్యేక దర్శన టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.1,65,620, అన్నదాన విరాళాలు రూ.64,874 ఆదాయం, కేశఖండన ద్వారా రూ.9,560, తులాభారం ద్వారా రూ.550, లడ్డూ ప్రసాద విక్రయం ద్వారా 18,510, కానుకల ద్వారా రూ.9 వేలు, వెరసి రూ.2,68,114 ఆదాయం సమకూరినట్టు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. సుమారు ఐదు వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, నారాయణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నాలుగేళ్లలో..ఆ రెండు చిత్రాలే..



డైరెక్టర్ సందీప్ వంగా

తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలోని సుకృత ఆడిటోరియంలో జీఎస్ఎల్ విద్యా సంస్థల మాతృ సంస్థ స్వతంత్ర ఆసుపత్రి 38వ వార్షిక వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన అర్జున్‌రెడ్డి, యానిమల్ సినిమాల దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా కొద్దిసేపు పాత్రికేయులతో ముచ్చటించారు. ఆ విశేషాలివి..

ప్రశ్న : మీరు చేసిన సినిమాల్లో వైద్య రంగానికి సంబంధించి ఉన్నాయి, దీనికి ప్రత్యేక కారణాలు?

సందీప్‌రెడ్డి : స్వతహాగా ఫిజియోథెరపిస్టుని కావడం వల్ల వైద్యంపై ఉన్న పరిజ్ఞానం సినిమాల్లో ప్రతిబింబింపజేసింది తప్ప ప్రత్యేకత ఏమీలేదు.

ప్రశ్న: ఫిజియోథెరపిస్టుగా ప్రాక్టీస్ చేస్తున్న మీరు సినిమాల వైపు ఎందుకెళ్లారు ?

సందీప్‌రెడ్డి: విద్యార్థి దశ నుంచి సినిమాల పట్ల ఆసక్తి ఎక్కువగా ఉండేది. ఫిజియోథెరపిస్టుగా ప్రాక్టీస్‌లో ఉన్నప్పటికీ సినిమా రంగం వైపు మక్కువతో వెళ్లడం జరిగింది.

ప్రశ్న : మీరు చేసే తదుపరి సినిమాలేంటి?

సందీప్‌రెడ్డి : త్వరలో ప్రభాస్ హీరోగా స్పిరిట్ ప్రారంభమవుతుంది.

ప్రశ్న : మహేష్ బాబుతో ఒక సినిమా తీస్తానన్నారు, అదెప్పుడు?

సందీప్‌రెడ్డి : మహేష్‌బాబుతో ఒక సినిమా చేయాలనుకున్న మాట వాస్తవమే, కానీ ప్రస్తుతం స్పిరిట్ ప్రారంభించాలి. ఆ తర్వాత యానిమల్ పార్ట్-2 తీయాలి, ఈ రెండు ప్రాజెక్టు పూర్తయ్యేసరికి 3 నుంచి 4 సంవత్సరాలు సమయం పడుతుంది. ఆ తర్వాతనే ఏదైనా..

ప్రశ్న : విద్యార్థులకు మీరిచ్చే సందేశం?

సందీప్‌రెడ్డి : సినిమాల ద్వారానే నా సందేశం ఏమిటో చెబుతుంటాను, వాటిలో ఉన్న మంచిని స్వీకరించి, చెడును అక్కడనే వదిలేయాలి. **- రాజానగరం**

మనం చేసే పనిలో దృష్టి సారిస్తే విజయాలు సొంతం

» ప్రముఖ సినీ దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా » ఘనంగా జీఎస్ఎల్-స్వతంత్ర ఇనిస్టిట్యూషన్స్ 38వ వార్షిక వేడుకలు





వార్షికోత్సవ కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సందీప్‌రెడ్డి, పక్కన సందీప్‌రెడ్డికి సత్కారం

రాజానగరం, ఆగస్టు17: ఏ వృత్తిలో అయినా తాము చేసే పనిలో దృష్టిసారిస్తే విజయాలు సొంతమవుతాయని యానిమల్ సినీ దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా అన్నారు. రాజానగరం సమీపంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో శనివారం ఏర్పాటుచేసిన జీఎస్ఎల్-స్వతంత్ర ఇనిస్టిట్యూషన్స్ 38వ వార్షిక వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా దర్శకుడు సందీప్‌రెడ్డి మాట్లాడుతూ చేసే పనిపై దృష్టి కేంద్రీకరిస్తే విజయం చేకూరుతుందన్నారు. జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో కల్పించిన అధునాతన సౌకర్యాలను ఎక్కడా చూడలేదన్నారు. అక్కడికి వెళ్లి చదువుకోవాలనిపించే అతికొద్ది సంస్థల్లో జీఎస్ఎల్ ఒకటిగా నిలుస్తుందన్నారు. కళాశాలలో ఏర్పాటుచేసిన స్మార్ట్ ల్యాబ్‌తోపాటు లైబ్రరీ తదితర విభాగాలను పరిశీలించిన డైరెక్టర్ సంతోషం వ్యక్తంచేశారు. మరో ముఖ్య అతిథి రాజా నగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ జీఎస్ఎల్ సంస్థల మూలంగా ప్రత్యక్షంగా, పరోక్షంగా 10 వేల కుటుంబాలు జీవిస్తున్నాయని, భవిష్యత్తులో జీఎస్ఎల్ సంస్థ మరింతగా విస్తరించాలని ఆకాంక్షించారు. అనంతరం జీఎస్ఎల్ వైద్య విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు సినీ డైరెక్టర్ సందీప్‌రెడ్డి, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ తదితరులను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో జీఎస్ఎల్ వైద్య విద్యా సంస్థ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ గన్ని సందీప్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గన్ని సాధిక, ఫిజియోథెరపీ ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ గురునాథ్ పాల్గొన్నారు.



అమ్మ ఇడ్లీ పథకాన్ని ప్రారంభిస్తున్న దర్శకుడు సందీప్‌రెడ్డి

స్వతంత్ర ఆసుపత్రిలో రూ.5కే అమ్మ ఇడ్లీ

ప్రారంభించిన సినీ దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 17: రాజమహేంద్రవరం జీఎస్ఎల్ స్వతంత్ర ఆసుపత్రిలో రూ.5కే మూడు ఇడ్లీలు అందజేయడం పేషెంట్లకు, వారి సహాయకులకు ఎంతో ఉపకరమని సినిమా దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా అన్నారు. శనివారం రాజమహేంద్రవరంలోని జీఎస్ఎల్ స్వతంత్ర ఆసుపత్రి 38వ వార్షికోత్సవ కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కేన్సర్ ఆసుపత్రిలోని చిన్నపిల్లల వార్డులో చిన్నారులకు పండ్లు పంచారు. కాగా కేవలం ఐదు రూపాయలకే మూడు ఇడ్లీలు, ఒక చట్నీ ఇస్తారని మేనేజర్ రామకృష్ణ తెలిపారు. తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, ఆయన సోదరుడు, జీఎస్ఎల్ సంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, డాక్టర్ తరుణ్ తదితరులు పాల్గొన్నారు.



సర్జరీ అనంతరం చంటిబిడ్డ

రోజుల బిడ్డకు జీజీహెచ్‌లో శస్త్రచికిత్స

పుట్టుకతోనే ఉదర భాగంలో చర్మంలేని వైనం.. విజయవంతమైన ఇలియాస్టమీ సర్జరీ

జీజీహెచ్(కాకినాడ), ఆగస్టు 17: నెలలు నిండకుండానే జన్మించిన రోజుల చంటిబిడ్డకు కాకినాడ జీజీహెచ్ వైద్యులు శస్త్రచికిత్స చేసి పునర్జన్మను అందించారు. ఆ బిడ్డను హెన్ (హెల్త్, ఎడ్యుకేషన్, న్యూట్రిషన్) స్టేట్ ప్రాజెక్టు చీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డీఎన్ మూర్తి శనివారం పరామర్శించి మెరుగైన వైద్యసేవలు అందించాలని జీజీహెచ్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారికి సూచించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం తీగలమెట్ట గ్రామానికి చెందిన గిరిజన మహిళ బోనంగి జానకి నెలలు నిండకుండానే స్థానిక పీహెచ్‌సీలో ఈనెల 15న మగశిశువుకు జన్మనిచ్చింది. కాగా శిశువు ఉదర భాగంపై చర్మం ఏర్పడకపోవడంతో పేగులు బయటకు వచ్చి శిశువు ప్రాణాపాయస్థితిలోకి వెళ్లాడు. దీంతో అక్కడ వైద్యులు మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌కు తరలించాల్సిందిగా సూచించారు. ఆ సూచన మేరకు కాకినాడ జీజీహెచ్‌కు రాగా పిడియాట్రిక్ సర్జరీ వైద్య బృందం శిశువుకు ఇలియాస్టమీ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి పునర్జన్మను ప్రసాదించారు. జీజీహెచ్‌లోని గిరిజన నిరీక్షణ కేంద్రంలో ఉన్న తల్లి జానకిని, డీఎన్ మూర్తి పరామర్శించి చంటిబిడ్డకు అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. ఆమెను బాలింతల సంరక్షణ వార్డులో చేర్పించేందుకు ఆదేశాలు జారీచేశారు.

కూటమి ప్రభుత్వంలో పోలీసుల పనితీరుకు నిదర్శనమిది

48 గంటల్లో ఇద్దరు బాలికల ఆచూకీ కనుగొన్నారు.. మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, ఆగస్టు 17: కిడ్నాప్‌కు గురైన ఇద్దరు బాలికల ఆచూకీ 48 గంటల్లో కనుగొనేలా తూర్పుగోదావరి జిల్లా పోలీసులు వ్యవహరించిన తీరు అభినందనీయమని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ అన్నారు. కూటమి ప్రభుత్వంలో పోలీసుల పనితీరుకు ఇది నిదర్శనమని చెప్పారు. పిఠాపురం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే వర్మను తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరానికి చెందిన మహిళ సునీత కలుసుకుని, తన ఇద్దరు కుమార్తెల ఆచూకీ కనుగొనేలా కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ సునీత తన ఇద్దరు కుమార్తెలను మారోజు వెంకటేష్ అనే వ్యక్తిపై తనకు అనుమానాలు ఉన్నట్టు తెలియజేశారని చెప్పారు. దీంతో తాను మంత్రి లోకేశ్ దృష్టికి విషయాన్ని తీసుకువెళ్లడంతోపాటు తూర్పుగోదావరి జిల్లా ఎస్పీతో మాట్లాడానని తెలిపారు. తాను ఎస్పీతో మాట్లాడిన 48 గంటల్లోనే ఇద్దరు బాలికలను తల్లి చెంతకు చేర్చారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోలీసు వ్యవస్థ సమర్థంగా పనిచేస్తుందనేందుకు ఇదే నిదర్శనమని తెలిపారు. ఇందుకు కృషి చేసిన మంత్రి లోకేష్‌కు, తూర్పుగోదావరి జిల్లా పోలీసులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కొండేపూడి సూర్యప్రకాష్, అనిశెట్టి సత్యానందరెడ్డి, బస్వా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు హెచ్‌సీఎల్ టెక్‌లో అవకాశం

రాజమహేంద్రవరం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ 2023, 2024లో పూర్తిచేసి 75% మార్కులు సాధించిన నాన్-మ్యాథ్స్ గ్రూపు విద్యార్థులకు హెచ్‌సీఎల్ టెక్ కంపెనీలో అసోసియేట్ రోల్స్‌లో అవకాశం కల్పిస్తున్నారని ఇంటర్ విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు (జోన్ 1,2) ఐ.శారద తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ఆసక్తి కలిగిన సీఈసీ, హెచ్ఈసీ, బైపీసీ, వొకేషనల్ విద్యార్థులు ఈనెల 20న ఉదయం పది గంటలకు రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో హెచ్‌సీఎల్ నిర్వహించే పరీక్షకు హాజరుకావాలని ఆమె చెప్పారు. https://bit.ly/tecbeeGoAP లింక్ ద్వారా రిజిస్ట్రేషను చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 96429 73350 నెంబరు సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో ఇంటర్ బోర్డు, హెచ్‌సీఎల్ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయని ఆర్ఐవో నరశింహం తెలిపారు. కాబట్టి అన్ని యాజమాన్యాల పరిధిలోని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ అర్హత కలిగిన వారందరూ పరీక్షకు హాజరయ్యేట్టు చూడాలని సూచించారు.





గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ. 5.47 లక్షలతో నిర్మించిన సంపద తయారీ కేంద్రం (ఫైల్).. విచారణ చేపట్టాలని కార్యదర్శిని ఆదేశిస్తున్న నల్లమిల్లి

చెత్త నుంచి సంపద కేంద్రం మాయం చేశారు

» 32 కొబ్బరి చెట్లూ కొట్టేశారు » పోలీసులకు ఫిర్యాదు చేసిన మహేంద్రవాడ కార్యదర్శి » విచారణ చేపట్టాలన్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, ఆగస్టు 17: అనపర్తి మండలం మహేంద్రవాడ గ్రామంలోని తూర్పు పుంతరోడ్డులో చెట్టుపట్టా పథకం కింద కేటాయించిన భూమిలో కొబ్బరి చెట్లు నరికివేత వివాదాస్పదంగా మారింది. ఈ భూమిలో ఉన్న 32 కొబ్బరి చెట్లను నరికివేయడంపై గ్రామ పంచాయతీ కార్యదర్శి జి పద్మావతి శనివారం పోలీసులకు ఫిర్యాదుచేశారు. కార్యదర్శి, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గతంలో తూర్పు పుంతరోడ్డులో ఎకరం భూమిని మేడపాటి పెదకాపు అనే కామిరెడ్డికి ప్రభుత్వం చెట్టూ పట్టా పథకం కింద 77 సంవత్సరాల లీజుకు ఇచ్చారు. అయితే పట్టాదారుకు చెందిన కుటుంబీకులు గ్రామంలో ఎవరూ ఉండకపోవడంతో అప్పటి నుంచి చెట్లు నిరుపయోగంగా ఉండడంతో పంచాయతీ వాటిని సంరక్షిస్తూ వచ్చింది. గతంలో టీడీపీ అధికారంలో ఉండగా అప్పటి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి హయాంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్ర నిర్మాణానికి ఈ భూమిని అధికారులు గుర్తించడంతో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.5.47లక్షలతో నిర్మాణం చేపట్టారు. కొద్దికాలం దీన్ని వినియోగించారు. తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ పాలనలో సంపద కేంద్రాన్ని కూలగొట్టి కొందరు స్థలానికి కబ్జా చేసేందుకు ప్రయత్నించారు. కేంద్రాన్ని మాత్రం పూర్తిగా తొలగించడంతో తిరిగి ఖాళీ స్థలంగా మారింది. గత రెండు రోజుల కిందట ఇదే స్థలంలో ఉన్న 32 కొబ్బరి చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికివేసి అదే స్థలంలో వదిలిపెట్టి పోయారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శికి సమాచారం ఇవ్వడంతో ఆమె అక్కడికి వచ్చి విచారణ చేపట్టి చెట్లను కొప్పవరం గ్రామానికి చెందిన వ్యక్తులు నరికినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకుని నరికిన చెట్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దీనిపై సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్టు తెలిపారు. చెట్లు నరికివేతపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు కార్యదర్శి తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

తుని రూరల్, ఆగస్టు 17: రైలు ఢీకొని మృతి చెందిన ఘటన తుని రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. తుని రైల్వే పెద్ద గేటు సమీపంలో విజయవాడ వైపు వెళుతున్న గుర్తు తెలియని రైలు కిందపడి 19 ఏళ్ల యువకుడు మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని రైల్వే పోలీసులు పరిశీలించి మృతుడి సెల్‌ఫోన్ ఆధారంగా వివరాలు సేకరించారు. రైల్వే ఎస్ఐ అబ్దుల్‌మారుఫ్ తెలిపిన వివరాలు ప్రకారం మృతుడు వి.భానుపద్మేశ్వరరావు (19)తుని మండలం ఎస్.అన్నవరం గ్రామానికి చెందిన వాడిగా గుర్తించారు. మృతుడు చనిపోదామని ఉద్దేశంతోనే రైలు కింద తల పెట్టినట్టు తెలుస్తోందని ఆయన చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి శవ పంచనామాలు అనంతరం కుటుంబీకులకు మృతదేహాన్ని అప్పగించినట్టు ఎస్ఐ తెలిపారు.

నందంపూడి వెల్ఫేర్ అసిస్టెంట్ సస్పెన్షన్

ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా కలెక్టర్

అంబాజీపేట, ఆగస్టు17: సహచర మహిళా ఉద్యోగి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి, విధులకు ఆటంకం కలిగించిన వెల్ఫేర్ అసిస్టెంట్‌ను కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సస్పెండ్‌చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం నందంపూడి సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న రాంజీ అదే సచివాలయంలో పశుసంవర్థక శాఖ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మహిళా ఉద్యోగి పట్ల ఈనెల ఒకటో తేదీన అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో ఆ యువతి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో రాంజీని సస్పెండ్ చేస్తూ శనివారం కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారని ఎంపీడీవో జీవీ సరోవర్ తెలిపారు.



మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

చెక్‌పోస్ట్‌ల్లో 24 గంటలూ తనిఖీలు

కాకినాడ పోర్టులో పీడీఎస్ బియ్యం రవాణాపై ఉక్కుపాదం

జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 17: కాకినాడ పోర్టులో ఉన్న రెండు చెక్‌పోస్ట్‌ల్లో 24 గంటలూ తనిఖీలు చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ పేర్కొన్నారు. కాకినాడ కలెక్టరేట్‌లో శనివారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోర్టులో బొంబాయి కాటా వద్ద ఉన్న చెక్‌పోస్ట్, శక్తిగ్యాస్ సమీపంలో ఉన్న అవుట్‌గేట్ వద్ద చెక్‌పోస్ట్‌ల్లో 24 గంటలూ బియ్యం లారీల తనిఖీ చేసేవిధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇక్కడ ఒక్కొక్క చెక్‌పోస్ట్ వద్ద ఒక డిప్యూటీ తహశీల్దార్‌తోపాటు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, ఇద్దర టెక్నికల్ అసిస్టెంట్లు, వీఆర్‌వో, పోలీసులు 24 గంటలూ మూడు షిఫ్ట్‌ల్లో పనిచేస్తారన్నారు. కాకినాడ పోర్టు నుంచి పీడీఎస్ బియ్యం ఎగుమతి కాకుండా ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. ప్రతి లారీను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే పోర్టులోకి అనుమతిస్తారన్నారు. ఈ సందర్భంగా ఎగుమతిదారులు, హమాలీ అసోయేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ కాకినాడ పోర్టుకు రోజూ వెయ్యి వాహనాలు వస్తున్నాయని, వాటిని సకాలంలో తనిఖీ చేయాలన్నారు. రోజుకు ఆరేడు ట్రిప్‌లు తిరిగే లారీలు చెక్‌పోస్ట్ వద్ద జాప్యం కారణంగా కేవలం మూడు ట్రిప్‌లు తిరుగుతున్నాయని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దీంతో కలెక్టర్ జోక్యం చేసుకుని వేగంగా తనిఖీలు చేయాలనే ఉద్దేశంతో తగిన చర్యలు తీసుకున్నామన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి ఎంవీ ప్రసాద్, సివిల్ సప్లయిస్ డీఎం బాల సరస్వతి, కాకినాడ ఆర్డీవో కిషోర్, ఎగుమతిదారులు, హమాలీల అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

జేఎన్టీయూకేలోని పలువురు అధికారులకు అంతర్గత బదిలీలు

జేఎన్టీయూకే, ఆగస్టు 17: జేఎన్టీయూకేలో పరిపాలనాపరమైన సంస్కరణల్లో భాగంగా ఇన్‌ఛార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు పలువురు అధికారులను అంతర్గత బదిలీలుచేస్తూ ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాధ్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. యూసీఈకే ఈఈఈ విభాగం ప్రొఫెసర్ సీహెచ్ సాయిబాబును జేఎన్టీయూకే అనుబంధ కళాశాలల్లో తల్లిదండ్రులు లేని విద్యార్థులను దత్తత తీసుకుని వారి బాగోగులను చూసేందుకు నూతనంగా ఏర్పాటుచేసిన కల్చర్, ఆర్ఫన్ అవుట్‌రీచ్ డైరెక్టరేట్‌కు ఇన్‌ఛార్జి డైరెక్టరుగా బదిలీచేశారు. యూవీ రత్నకుమారిని ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్ గ్రీవెన్సెస్ ఇన్‌ఛార్జి డైరెక్టరుగానూ, ప్రొఫెసర్ ఎం.నాగేశ్వరరావును వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్(యూజీ) గానూ, ఎం.స్వరూపారాణిని అడ్మినిస్ట్రేషన్ విభాగం ఇన్‌ఛార్జి వైస్ ప్రిన్సిపాల్‌గానూ, ప్రొఫెసర్ జీవీఎస్ఆర్ దీక్షితులను యూసీఈకే అకడమిక్స్ విభాగం ఇన్‌ఛార్జి వైస్ ప్రిన్సిపాల్‌గానూ నియమించారు. అదేవిధంగా కె.వెంకటరెడ్డిని ఈఈఈ విభాగాధిపతిగానూ, ఎన్.రామకృష్ణయ్యను సీఎస్ఈ విభాగాధిపతిగానూ, ఎం.శైలజను ఈసీఈ విభాగం ప్రొఫెసర్‌గానూ, ఎం.కుమారస్వామిని మెకానికల్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గానూ, డాక్టర్ ఉషాదేవిని ఏసీఈగానూ బదిలీచేశారు. ఈ సందర్భంగా నూతనంగా నియామకమైన అధికారులను ఇన్‌ఛార్జి వీసీ మురళీకృష్ణ అభినందించారు.

ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలి

కాకినాడ రూరల్, ఆగస్టు 17: కాకినాడ జిల్లాలోని ప్రభుత్వ, జడ్పీ, ఎంపీ, ఎయిడెడ్, పురపాలక యాజమాన్యాలు, ఏపీఆర్ఈఐఎస్, ఏపీఎస్ఈఆర్ఈఐఎస్, ఏపీటీడబ్ల్యూఆర్ఈఐఎస్, ఏపీఎంఎస్ అన్ని ఇతర యాజమాన్యాల ప్రాథమిక, ప్రాథమికోన్నత,ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తూ కనీసం 15 ఏళ్ల బోధనానుభవం గల అన్ని కేటగిరీలకు చెందిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు జిల్లా స్థాయి పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో పిల్లి రమేష్ తెలిపారు. deoeg.org వెబ్‌సైట్‌లో ఉదహరించిన నియమ నిబంధనలననుసరించి అర్హత గల ఉపాధ్యాయులు దరఖాస్తు చెక్‌లిస్ట్‌ను పూరించి ఈనెల 28 లోపు సంబంధిత తనిఖీ అధికారుల ద్వారా డీఈవో కార్యాలయంలో సమర్పించాలని కోరారు.



అప్పనపల్లిలో శనివారం బాలబాలాజీని దర్శించుకుంటున్న భక్తులు

అప్పనపల్లి బాల బాలాజీ ఆలయానికి పోటెత్తిన భక్తులు

మామిడికుదురు, ఆగస్టు 17: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీ స్వామి దేవస్థానం శనివారం భక్తులతో పోటెత్తింది. వేకువజాము నుంచి భక్తులు స్వామివారి దర్శనం కోసం బారులు తీరారు. కొత్త, పాత ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శనివారం 3,671మంది స్వామి వారిని దర్శించుకున్నారు. 2,948 మంది స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.3,17,707 ఆదాయం వచ్చిందని ఏసీ జి.మాధవి తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ఏసీ, సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్వామివారి నిత్యాన్నదాన పథకానికి పాశర్లపూడి బాడవకు చెందిన కాండ్రేగుల వెంకటేశ్వరరావు, సూర్యావతి దంపతులు రూ.11,111 విరాళం అందించారు.

ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు

అమలాపురం టౌన్, ఆగస్టు 17: జనకల్యాణ్ సంస్థ ఆధ్వర్యంలో అమలాపురం ఐసీడీఎస్ కార్యాలయంలో శనివారం హెచ్ఐవీ, లైంగిక వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. సీడీపీవో కేవీఎల్ కుమారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి కౌన్సిలర్ జి.కవిత, జనకల్యాణ్ ప్రోగ్రాం మేనేజర్ జి.శ్రీనివాస్, రమణి, శాంతి, అమలలు హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు అన్నపూర్ణ, బి.మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

● కోల్‌కతాలో పీజీ వైద్య విద్యార్థినిపై జరిగిన అత్యాచారం, హత్య ఘటనలు నిరసిస్తూ ర్యాలీలు, ప్రదర్శనలు ● దోషులను శిక్షించాలని డిమాండ్

వైద్యులు, వైద్య సిబ్బందికి రక్షణ కల్పించండి








ముమ్మిడివరంలో కొవ్వొత్తులతో కోనసీమ జిల్లాలోని వైద్యుల నిరసన, ద్రాక్షారామ: రామచంద్రపురంలో ప్రైవేటు వైద్యుల నిరసన, మలికిపురం:డిగ్రీ కళాశాలలో కొవ్వొత్తులతో శ్రద్ధాంజలి, యానాం: యానాం ఆసుపత్రి వద్ద డాక్టర్లు, సిబ్బంది నిరసన

అమలాపురం టౌన్, ఆగస్టు 17: కోల్‌కతాలోని ఆర్జీకర్ ప్రభుత్వ వైద్య కళాశాలలో పీజీ వైద్య విద్యార్థినిపై జరిగిన అమానవీయ సంఘటనను నిరసిస్తూ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో శనివారం అమలాపురం గడియార స్తంభం సెంటర్‌లో నిరసనప్రదర్శన నిర్వహించారు. ఐఎంఏ జిల్లాశాఖ అధ్యక్షుడు డాక్టర్ వీఎస్ఎస్ఎన్ మూర్తి, కార్యదర్శి డాక్టర్ కడలి ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వంద మందికిపైగా వైద్యులు నిరసనలో పాల్గొన్నారు. 24గంటల పాటు వైద్య సేవలను పూర్తిగా నిలుపుదల చేసినట్టు ప్రకటించారు. వైద్య విద్యార్థినిపై అత్యాచారం, హత్య చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని, అదే ఆసుపత్రిపై దాడి జరిపిన దుండగులకు కఠినంగా శిక్షపడాలన్నారు. అనంతరం మహాత్మాగాంధీ విగ్రహం వద్ద ఘనంగా నివాళులర్పించారు. అక్కడి నుంచి ర్యాలీగా కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. వైద్యులపై జరుగుతున్న దాడుల ఘటనలపై కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అవసరమైతే ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకునే విధంగా చర్యలు తీసుకుంటామని, దీనిపై త్వరలోనే మరోసారి ఐఎంఏ ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తామన్నారు. ఆయాకార్యక్రమాల్లో ఐఎంఏ ప్రతినిధులు డాక్టర్ పీఎస్ శర్మ, డాక్టర్ గొలకోటి రంగారావు, డాక్టర్ శ్రీనివాసదీక్షితులు, డాక్టర్ గిరిజాకుమారి, డాక్టర్ రమాదేవి, డాక్టర్ మాధవి, డాక్టర్ నీలిమ, డాక్టర్ శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.

వైద్యురాలి హత్యకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ

కిమ్స్ వైద్య కళాశాలలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఎర్రవంతెన వరకు జరిగిన ర్యాలీలో 600మంది వైద్యులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు. కిమ్స్ డీన్ డాక్టర్ ఆనంద్‌ఆచార్య, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.సుబ్బారావు, ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ గొలకోటి రంగారావు, పాథాలజీ విభాగాధిపతి డాక్టర్ త్రిపెన్ సోలోపాల్ తదితరులు పాల్గొన్నారు. వైద్య విద్యార్థిని మృతికి కారకులైన దోషులను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేశారు. వైద్యురాలిపై జరిగిన ఘటనను కిమ్స్ చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు, ఎండీ కె.రవికిరణ్‌వర్మ ఖండించారు.

అల్లవరం: అల్లవరంసీహెచ్‌సీ, గోడిలంక, బెండమూర్లంక పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో, పోలీసు స్టేషన్లలో వినతిపత్రాలు సమర్పించారు. వైద్యాధికారులు డాక్టర్ వై.బాలసుబ్రహ్మణ్యం, డాక్టర్ సరోజ, డాక్టర్ ఎస్.సుమ, డాక్టర్ పృథ్వీరాజ్, డాక్టర్ రాకేష్, డాక్టర్ శాంతిప్రియ, డాక్టర్ అమృత, సిబ్బందిపాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: ఉప్పలగుప్తం, ఎస్.యానాం, భీమనపల్లి పీహెచ్‌సీల ఆధ్వర్యంలో ఉప్పలగుప్తం పీహెచ్‌సీ వద్ద శనివారం ఆందోళన చేశారు. నిరసన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారులు లంకే నాగార్జున, దివ్యజ్యోతి, డిల్లీ ప్రసాద్, ప్రసన్న, సీహెచ్‌వో ఎం.విజయలక్ష్మి, ఎంపీహెచ్‌ఈవోలు విప్పర్తి వరప్రసాదరావు, రాయుడు రామకృష్ణ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఆలమూరు: మండలంలో శనివారం వైద్యులు వైద్య సేవలను బంద్ చేసి నిరసన తెలిపారు. ఆలమూరు ప్రభుత్వ ఆసుపత్రి, పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీలలో వైద్యులు సేవలను బంద్ చేసి నిరసన తెలిపారు. పెదపళ్ల వైద్యాధికారులు పి.భవానీశంకర్ ఆధ్వర్యంలో వైద్యులు భారీ ర్యాలీ నిర్వహించారు. వైద్యురాలు హత్యకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుని కఠినంగా శిక్షించాలని కోరుతూ నినాదాలు చేశారు.

యానాం: యానాం ప్రభుత్వాసుపత్రి ఎదుట వైద్యులు, సిబ్బంది నిరసన చేపట్టారు. కోల్‌కత్తాలో జరిగిన ఘటనల్లో కారకులను శిక్షించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రాలను యానాంఆరోగ్యశాఖ డీడీ, పరిపాలనాధికారికి అందజేశారు.

ద్రాక్షారామ: ద్రాక్షారామలో వైద్యులు, వైద్య సిబ్బంది నిరసన ప్రదర్శన, మానవహారం నిర్వహించారు. ద్రాక్షారామ, వెల్ల పీహెచ్‌సీ వైద్యులు, కె.గంగవరం మండలం కుందూరు, పామర్రు, దంగేరు, పేకేరు పీహెచ్‌సీ వైద్యులు, వైద్యసిబ్బంది ప్లకార్డులతో ప్రదర్శనజరిపారు. బోసుబొమ్మ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ టి.ఎస్.ఎస్.సందీప్‌నాయుడు, డాక్టర్ పి.అలేఖ్య, డాక్టర్ ప్రతాప్, డాక్టర్ జాయ్‌కేథరిన్, డాక్టర్ పి.ఆమని, వైద్యసిబ్బంది పాల్గొన్నారు. రామచంద్రపురంలో ప్రైవేటు వైద్యులు వైద్యసేవలు నిలిపివేశారు. పట్టణంలో శోభానర్సింగ్ హోమ్ నుంచి కమలానర్సింగ్ హోమ్‌వరకు నిరసన ప్రదర్శన జరిపారు. కమలానర్సింగ్ హోమ్ వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. రామచంద్రపురం ఐఎంఏ శాఖ అధ్యక్షుడు డాక్టర్ పి.వెంకటరత్నం, డాక్టర్ జి.జానకిరామయ్య చౌదరి, డాక్టర్ చెలికాని రామారావు, డాక్టర్ కవిత, డాక్టర్ గిరిబాల పాల్గొన్నారు.

ఐ.పోలవరం: శనివారం ఐ.పోలవరంలో వైద్యఆరోగ్య సిబ్బంది ఆందోళన చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేశనకుర్రు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎమ్మెస్ రమేష్‌బాబు, వేమవరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి కె.ఇందిరాశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు. ఎంపీడీవో టి.చైతన్య కల్యాణ్‌భరత్ సంఘీభావం ప్రకటించారు.

కొత్తపేట: వైద్యురాలిపై జరిగిన అత్యాచారం, హత్య ఘటనలు నిరసిస్తూ ర్యాలీ నిర్వహించి మండలపరిషత్ మీదుగా పాత బస్టాండు సెంటర్‌కు చేరుకుని మానవహారం నిర్వహించి నిరసన తెలిపారు. దోషులను శిక్షించాలని స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు అందించారు. అక్కడి నుంచి ర్యాలీగా బయలుదేరి ఆర్డీవో జీవీవీ సత్యనారాయణకు వినతిపత్రం అందించారు. డాక్టర్ శేషుబాబు, కె.వీర్రెడ్డి, డాక్టర్ ఎం.గంగిరెడ్డి, డాక్టర్ మెంటే ఉదయభాస్కరరావు, డాక్టర్ సుమలత, డాక్టర్ భాస్కర్‌నాయుడు, డాక్టర్ మధుకర్, డాక్టర్ భీమారెడ్డి, డాక్టర్ రమేష్‌రెడ్డి, డాక్టర్ అనుష, డాక్టర్ తరుణ, డాక్టర్ జి.దుర్గాప్రసాద్, డాక్టర్ ఎం.వంశీమోహన్, డాక్టర్ దుర్గాకుమారి, డాక్టర్ శ్రీదివ్య, డాక్టర్ ఎస్.నిహారిక, డాక్టర్ ఎ.శివ పాల్గొన్నారు.

రావులపాలెం: రావులపాలెంలో ప్రభుత్వ,ప్రైవేటు వైద్యులు, మెడికల్ షాపుల నిర్వాహకులు, ఆర్ఎంపీ, పీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్ఎంలు, వైద్యేతర సిబ్బంది రావులపాడు వద్ద నుంచి ర్యాలీగా రావులపాలెం కళా వెంకట్రావు సెంటర్‌కు చేరుకున్నారు. కోల్‌కతా ఘటనలకు సంబంధించిన దోషులను వెంటనే శిక్షించాలంటూ జాతీయ రహదారిపై కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తూ నినాదాలు చేశారు. అనంతరం దోషులను శిక్షించాలంటూ స్థానిక ఎస్‌హెచ్‌వోకు ఫిర్యాదు చేశారు.

కె.గంగవరం: పామర్రు, కుందూరు, దంగేరు, పేకేరు ఆసుపత్రుల సిబ్బంది కె.గంగవరం మెయిన్ రోడ్డుపై మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. దోషులను శిక్షించాలని నినాదాలు చేశారు. తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ చేశారు. తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కుందూరు, దంగేరు, పామర్రు ఆసుపత్రి వైద్యులు ఎస్.ప్రతాప్, కేథరిన్, ఆమని, రత్నసుధ, సందీప్ నాయుడు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పి.గన్నవరం: నాగుల్లంక ప్రాథమికఆరోగ్య కేంద్రం వైద్యులు నిరసన చేపట్టారు. పి.గన్నవరం మండల పరిషత్ కార్యాలయం నుంచి త్రీరోడ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. పి.గన్నవరం సీహెచ్‌సీలో అత్యవసర కేసులకు సేవలు అందించి ఓపీ నిలిపివేశారు. వైద్యులు డాక్టర్ షేక్ జాసీమ్, డాక్టర్ రియాజ్‌ఉన్నిసాబేగం, బి.మూర్తి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

మామిడికుదురు: నిందితులను శిక్షించాలని నగరం, లూటుకుర్రు పీహెచ్‌సీ సిబ్బంది శనివారం మామిడికుదురు సెంటర్‌లో నిరసన చేపట్టారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుంచి ప్లకార్డులతో నినాదాలు చేస్తూ మామిడికుదురు సెంటర్ వరకు ర్యాలీ చేశారు. అనంతరం సెంటర్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో వైద్య అధికారులు జి.రమ్య శైలజ, స్వర్ణలత, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశాలు పాల్గొన్నారు.

రాయవరం: రాయవరంలో వైద్యులు, వైద్య ఆరోగ్య సిబ్బంది నిరసన చేపట్టారు. రాయవరం, మాచవరం పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది రాయవరంలో ర్యాలీ నిర్వహించారు. తహశీల్దారు, ఎంపీడీవో కార్యాలయాల్లో, పోలీస్ స్టేషన్‌లో వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు రమ్యశ్రీ, ఎం.శ్రీనివాస్, కె.మణికంఠ, వి.అనిరుధ్, వైద్య ఆరోగ్య సిబ్బంది తులసీదాస్, గోపాలకృష్ణ, జె.శంకర్, ఎ.సరోజిని పాల్గొన్నారు.

రాజోలు: తాటిపాక పీహెచ్‌సీ వైద్య ఆరోగ్య సిబ్బంది తాటిపాక సెంటర్‌లో మానవహారం నిర్వహించి నిరసన తెలిపారు. తాటిపాక పీహెచ్‌సీ నుంచి వైద్య ఆరోగ్య సిబ్బంది ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం చేరుకున్నారు. డాక్టర్ ఫణికిరణ్ తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. వైద్య ఆరోగ్య సిబ్బందికి ఎంపీపీ కేతా శ్రీను మద్దతు తెలిపారు. కార్యక్రమంలో మద్దాల శ్రీనివాసు, ఏఎన్ఎంలు, పీహెచ్‌సీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మండపేట: మండపేటలో ప్రభుత్వ ప్రైవేటు వైద్యులు నిరసన చేపట్టారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మండపేటలో వైద్యులు రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కేశవరం, ద్వారపూడి ప్రభుత్వాసుపత్రుల వైద్యులు, వైద్య సిబ్బంది శనివారం మధ్యాహ్నం ర్యాలీ నిర్వహించారు. కేశవరం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ లత సారథ్యంలో ప్లకార్డులతో నిరసన చేపట్టారు.

ముమ్మిడివరం: ముమ్మిడివరం ప్రభుత్వాసుపత్రి వైద్యులు, సిబ్బంది, మండలంలో పీహెచ్‌సీ వైద్యులు, వైద్య సిబ్బంది ర్యాలీలు నిర్వహించారు. ముమ్మిడివరంలో వైద్యులు ఆరోగ్య సిబ్బంది సంయుక్తంగా ముమ్మిడివరంలో ర్యాలీ నిర్వహించి స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అలాగే పోలీసుస్టేషన్ ఎదుట మానవహారం నిర్వహించారు. ముమ్మిడివరం అర్బన్ ఆసుపత్రి వైద్యురాలు యోగితాలక్ష్మీ, కమ్యూనిటీ హెల్త్ వైద్యురాలు దయానా, షరుఖా, కొత్తలంక పీహెచ్‌సీ వైద్యురాలు ముకుందా, బి.సూజ, శేరుల్లంక పీహెచ్‌సీ వైద్యురాలు అల్లు మణి, సుధారాణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం తహశీల్దార్ ఎం.విసుబ్బ లక్ష్మికి వినతిప్రతం అందజేశారు. ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం, హత్య సంఘటనను నిరసిస్తూ ముమ్మిడివరంలో శనివారం రాత్రి వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించి వైద్యులు, పారా మెడికల్ సిబ్బంది, ఆశ వర్కర్లు ముమ్మిడివరంలోని ఎయిమ్స్ కళాశాలలో గల డీఎం హెచ్‌వో కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. జిల్లాలోని వైద్యులు,పారామెడికల్ సిబ్బంది, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

మలికిపురం: నిందితులను కఠినంగా శిక్షించాలని లక్కవరం పీహెచ్‌సీ సిబ్బంది లక్కవరం నుంచి మలికిపురం ఎంపీడీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. పీఎంపీ, ఆర్ఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మలికిపురం సెంటర్‌లో నిరసన చేపట్టారు. అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు. మలికిపురం డిగ్రీ కళాశాలలో వైద్య విద్యార్థిని ఆత్మకు శాంతి కలగాలని కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద ఆశ, ఏఎన్ఎంలు నిరసన చేపట్టారు. ఉయ్యూరి వారిమెరక నాలుగు రోడ్ల జంక్షన్‌లో కూటమి నాయకుల ఆధ్వర్యంలో ఓదూరి రాజా నేతృత్వంలో కొవ్వొత్తులతో నిరసన చేపట్టారు. ఈకార్యక్రమాల్లో ఎంపీహెచ్‌ఈవో చంటి, నరసింహారావు, మరియమ్మ, పీఎంపీ, ఆర్ఎంపీల తరపున ఆర్.వెంకట్రాజు, యేడిద వెంకట్రామయ్య ఉమామహేశ్వరరావు, యెనుముల సుబ్బారావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.సతీష్ నక్కా రమేష్‌బాబు, కొమరగిరి విజయ్‌కుమార్, ఓదూరి రాజా, తోట ప్రసాద్, సత్తిబాబు, జయసూరిబాబు, జయబాబుపాల్గొన్నారు.

అంతర్వేది: రామేశ్వరం, మోరి, సఖినేటిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది శనివారం సఖినేటిపల్లి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మకు వినతిపత్రం అందించారు. అనంతరం సఖినేటిపల్లి మూడు తూముల వద్ద ప్రధాన రహదారిపై మానవహారం, ర్యాలీ నిర్వహించారు.కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఎండీ యూనస్, ఎ.పూర్ణచంద్రకుమార్, డాక్టర్ సీహెచ్ దుర్గాకావ్య, డాక్టర్ శామ్యూల్‌ప్రణవ్, సూపర్‌వైజర్లు, స్టాఫ్ నర్సింగ్, ఫార్మసీ, ల్యాబ్ టెక్నీషియన్లు, హెల్త్ అండ్‌వెల్‌నెస్, సీహెచ్‌వోలు ఏఎన్ఎం, ఆశలు పాల్గొన్నారు. మండలంలోని ఆర్ఎంపీ, పీఎంపీలు నిరసన చేపట్టారు.

కపిలేశ్వరపురం: కపిలేశ్వరపురంలో కపిలేశ్వరపురం సీహెచ్‌సీ, అంగర, అచ్యుతాపురం, వాకతిప్ప పీహెచ్‌సీల వైద్యాధికారులు, స్టాఫ్‌నర్సులు, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాలు ర్యాలీ, మానవహారం నిర్వహించారు. స్థానిక సీహెచ్‌సీ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. స్థానిక బస్టాండ్‌లో మానవహారం జరిపారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ రాజ్‌కుమార్, వాకతిప్ప, పీహెచ్‌సీ వైద్యాధికారులు, డాక్టర్ చంద్రమౌళి, డాక్టర్ రాకేష్, అచ్యుతాపురం, అంగర పీహెచ్‌సీల వైద్యాధికారులు, ఎంపీహెచ్ఈవో, హెచ్ఈ, ఎంపీహెచ్ఎస్‌లు, హెచ్‌వీలు, సూపర్‌వైజర్లు, ఆశాలు, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్రేయపురం: ఆత్రేయపురం, ర్యాలి పీహెచ్‌సీలకు చెందిన వైద్యులు, వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఆత్రేయపురం రావిచెట్టు సెంటర్ నుంచి ర్యాలీగా తరలివచ్చి బస్టాండ్ సెంటర్‌లో మానవహారం నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. వైద్య విద్యార్థిని హత్య కేసులో దోషులను శిక్షించాలన్నారు. వైద్యాధికారులు పి.సౌమ్య, దుర్గాభవాని, విజయకుమారి, సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి, సత్యదేవుడి కల్యాణం

రాయవరం, ఆగస్టు 17: వెదురుపాక విజయదుర్గా పీఠం 52వ వార్షికోత్సవంలో భాగంగా రెండో రోజు శనివారం అహోబిలం వేదపండితులు శ్రీలక్ష్మి నరసింహస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. తొలుత సుదర్శన చక్రం, లక్ష్మీనరసింహస్వామికి పంచ ద్రవ్యాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం హోమం నిర్వహించి కల్యాణం విశిష్టతను వివరించారు. అన్నవరం వేదపండితులు పీఠంలో ఉన్న అనంతలక్ష్మి సహిత వీరవెంకట సత్యనారాయణస్వామి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అలంకరణ జరిపి శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. ఈసందర్భంగా పీఠాధిపతి గాడ్ ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తూ లక్ష్మీనరసింహస్వామి, సత్యదేవుడి కల్యాణం విశిష్టతను వివరించారు. అనంతరం విజయదుర్గా సేవాసమితి ఆధ్వర్యంలో అన్నసమారాధన చేశారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, విజయదుర్గా సేవాసమితి ప్రతినిధులు గాదే భాస్కరనారాయణ, సత్యవెంకట కామేశ్వరి, పెద్దపాటి సత్యకనకదుర్గ, బలిజేపల్లి రమ, పీఠం పీఆర్వో బాబి తదితరులు పాల్గొన్నారు.

షిరిడీసాయి ఆలయంలో నాయకుల పూజలు

ఉప్పలగుప్తం, ఆగస్టు 17: భీమనపల్లి శ్రీషిర్డీ సాయిబాబా ఆలయంలో శనివారం అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, ఎంపీ గంటి హరీష్‌మాధుర్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు పూజలు నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో కార్యకర్తల మొక్కు మేరకు ప్రత్యేకపూజలు జరిగాయి. అనంతరం టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, అంబేడ్కర్ కోనసీమ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ స్వగృహం వద్ద కూటమి నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే, ఎంపీ, మెట్ల రమణబాబులను సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ ఉప్పలగుప్తం, అల్లవరం మండలాల అధ్యక్షులు అరిగెల నానాజీ, దెందుకూరి సత్తిబాబురాజు, యువత అధ్యక్షుడు ఆకేటి పెద్ద, టీడీపీ అధికార ప్రతినిధి అల్లాడ స్వామినాయుడు, ఎంపీటీసీ దేశంశెట్టి నాగరత్నకుమారి, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, అధికారి జయలక్ష్మి, ఉపసర్పంచ్ కోలపల్లి గోపి, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ కమిటీ ఎన్నిక

మలికిపురం,ఆగస్టు17: గొల్లపాలెం మండల ప్రజాపరిషత్ పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్‌గా చింతా సుశీల, వైస్‌చైర్మన్‌గా దొంగ నాగమణి ఎన్నికయ్యారు. గతంలో ఈ పాఠశాలలో విద్యా కమిటీ ఎన్నిక నిలిచిపోయింది. ఎంఈవో పర్యవేక్షణలో ఎన్నికలు నిర్వహించారు. గుండుమేను నారాయణమూర్తి, కందుల విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బందికి అవార్డులు

అంతర్వేది, ఆగస్టు17: మోరి, మోరిపోడుగ్రామాల్లో వంద శాతం ఇంటి పన్ను వసూలుచేసి విష్ణుమాణిక్యాలరావుకు ఉత్తమ సర్వీసు అవార్డు, మోరి కంప్యూటర్ ఆపరేటర్‌కు ఉత్తమ సేవా పురస్కారం డీపీవో రాంబాబు నుంచి అవార్డులు అందుకున్నారు. మోరిపోడు సర్పంచ్ ముప్పర్తి అలివేలుగంగాత్రివేణి, ఎంపీటీసీ బళ్ల సుభాషిణి, టీడీపీ మండల అధ్యక్షుడు ముప్పర్తి నాని అభినందనలు తెలిపారు.

ఉత్తమ అవార్డు గ్రహీతకు అభినందనలు

మలికిపురం, ఆగస్టు 17: మలికిపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ నల్లి ప్రకాష్ అమలాపురంలో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో కలెక్టర్ నుంచి ఉత్తమ ఉద్యోగ అవార్డును అందుకున్నారు. ఈసందర్భంగా కార్యాలయ ఆవరణలో శనివారం జరిగిన కార్యక్రమంలో ప్రకాష్‌ను జిల్లా సబ్‌రిజిస్ట్రార్ బి.శ్రీనివాస్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మలికిపురం సబ్‌రిజిస్ట్రార్ ఎంపీ సుధారాణి, స్టాంపు లేఖర్లు, కార్యాలయ సిబ్బంది ప్రకాష్‌ను దుశ్శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో కంచుస్తంభం వాసు, ఏవీ నాయుడు, కె.రాంబాబు, బొల్లాప్రగడ వంశీ, ఎం.వెంకయ్య, సత్తిబాబు, మూర్తి, ప్రకాష్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు.. ప్యానల్ కమిటీల ఎన్నిక

డీసెంట్ తెలిపి వాకౌట్ చేసిన విపక్ష కౌన్సిలర్లు



మున్సిపల్ సమావేశంలో కమిటీల ఏర్పాటు తీరుపై నిరసన తెలుపుతున్న విపక్ష కౌన్సిలర్లు

అమలాపురంటౌన్, ఆగస్టు17: అమలాపురం మున్సిపల్ కౌన్సిల్ ప్రత్యేక సమావేశం శనివారం చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి అధ్యక్షతన జరిగింది. ప్రధానంగా మూడేళ్లుగా కాంట్రాక్టు కమిటీలను నియమించకుండా కాలయాపన చేసుకుంటూ వచ్చి ప్యానల్ కమిటీల ఎన్నికలు నిర్వహించిన తీరుపై టీడీపీ, జనసేన కౌన్సిలర్లు నిరసన తెలిపారు. మూడేళ్లుగా లేని కమిటీలు ఇప్పుడు వేయడం ఏమిటని ప్రశ్నించి డీసెంట్ తెలిపి సమావేశం నుంచి టీడీపీ కౌన్సిలర్ బొర్రా వెంకటేశ్వరరావు, జనసేన కౌన్సిలర్లు యేడిద శ్రీను, తిక్కా సత్యలక్ష్మి, పడాల శ్రీదేవి వాకౌట్‌చేశారు. అనంతరం చైర్‌పర్సన్ ఆధ్వర్యంలో ఏడుగురు సభ్యులతో కూడిన ఉపాధ్యాయేతర పోస్టుల నియామకానికి ప్యానల్ కమిటీని అధికార పక్ష వైసీపీ కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్యానల్ కమిటీలో రుద్రరాజు వెంకట్రాజు, తిక్కిరెడ్డి వెంకటేష్, కట్టోజు సన్యాయిదాసు, బండారు గోవింద, చిత్రపు రామకృష్ణ, నాగారపు వెంకటేశ్వరరావు, సీహెచ్‌వీరవెంకటసత్యనారాయణలను ఎన్నుకున్నారు. ఈ కమిటీని కౌన్సిలర్ గొవ్వాల రాజేష్ ప్రతిపాదించారు. కాంట్రాక్టు కమిటీకి సంబంధించి కౌన్సిలర్లు సుంకర పార్వతి, కొల్లాటి దుర్గాబాయి, వాసర్ల లక్ష్మి, దొంగ నాగసుధారాణి, యండమూరి గంగ, గోపి రాజీ, యన్నాబత్తుల పద్మలను ఎన్నుకున్నారు. సమావేశంలో ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్ పాల్గొన్నారు. అనంతరం ఆయాకమిటీల సభ్యులు కౌన్సిలర్లతో కలిసి మాజీమంత్రి పినిపే విశ్వరూప్‌ను కలుసుకున్నారు.

అదుపుతప్పిన వ్యాన్: ముగ్గురికి గాయాలు

ఆలమూరు, ఆగస్టు 17: చొప్పెల్ల వద్ద జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. చొప్పెల్ల గ్రామానికి చెందిన ఆకుల వెంకన్న(45), అడబాల సత్యనారాయణ(57), చిక్కిరెడ్డి రాజు(32) పొలం పనులు ముగించుకుని ఇంటికి రావడానికి చొప్పెల్ల డివైడర్ వద్ద ఆగి ద్విచక్రవాహనాలపై ఉండగా జొన్నాడ నుంచి రాజమహేంద్రవరం వెళుతున్న వ్యాన్ అదుపుతప్పి వారిపైకి దూసుకొచ్చింది. దీంతో ముగ్గురికి గాయాలయ్యాయి. రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం నిమిత్తం ఇద్దర్ని కాకినాడకు తరలించినట్లు ఆలమూరు పోలీసులు తెలిపారు. ఎస్ఐ అశోక్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరమణ	: మిస్టర్ బచ్చన్
శ్రీలలిత	: కమిటీ కుర్రోళ్లు
శేఖర్ స్క్రీన్-1	: డబుల్ ఇస్మార్ట్
శేఖర్ స్క్రీన్-2	: వేద
రమా	: ఆయ్
గణపతి	: రాయన్
వెంకటపద్మావతిస్క్రీన్-1	: డబుల్ ఇస్మార్ట్
వెంకటపద్మావతి స్క్రీన్-2	: తంగలాన్

హెచ్‌సీఎల్ టెక్ కంపెనీలో అసోసియేట్ అవకాశాలు

అమలాపురం టౌన్, ఆగస్టు 17: 2023-2024 సంవత్సరాల్లో ఇంటర్మీడియట్ పూర్తిచేసి 75శాతం పైబడి మార్కులు వచ్చిన గణితంతో సంబంధం లేని గ్రూపుల విద్యార్థులకు హెచ్‌సీఎల్ టెక్ కంపెనీలో అసోసియేట్‌గా అవకాశం కల్పిస్తున్నట్టు రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఐ.శారద తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాలల్లో సీఈసీ, హెచ్‌ఈసీ, బైపీసీ, ఒకేషనల్ విద్యార్థులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చు. రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఈనెల20వ తేదీ ఉదయం 10గంటలకు హెచ్‌సీఎల్ టెక్ కంపెనీ ఆధ్వర్యంలో పరీక్ష నిర్వహిస్తారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, ముందుగా ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేయించుకోవాలని ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎన్ఎస్‌వీఎల్ నరసింహం తెలిపారు. వివరాలకు సాయికిరణ్, సెల్ 9642973350ను సంప్రదించాలన్నారు.

కిడ్నీ బాధిత యువకుడికి రూ.లక్ష సాయం

పి.గన్నవరం, ఆగస్టు 17: లంకలగన్నవరం శివారు డొక్కా సీతమ్మకాలనీకి చెందిన యువకుడు కొల్లు రవీంద్ర కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. కాట్రేనికోన మండలం సిర్రాయానాం, పల్లం, నీలరేవు గ్రామాలకు చెందిన అగ్నికుల క్షత్రియ సంఘాలు సభ్యులు సేకరించిన రూ.లక్ష బాధితుడికి అందించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు అవనిగడ్డ నారాయణమూర్తి, మాల్లాడి దయ, అవనిగడ్డ శ్రీరాములు, బొమ్మిడి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనాలు

అమలాపురం రూరల్, ఆగస్టు 17: కామనగరువు శివారు మెండువారిపేటలోని ముక్తిధామ్ ప్రాంగణంలో శనివారం విద్యార్థులకు జేసీఐ ఆధ్వర్యంలో ఉపకార వేతనాలను అందజేశారు. ఆకొండి గోపాలకృష్ణమూర్తి గ్రంథాలయంలో జేసీఐ అధ్యక్షుడు ఆకొండి చాణుక్య ఆధ్వర్యంలో 6నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మార్కులు ఆధారంగా ఉపకార వేతనాలను అందించారు. గ్రంథాలయం ప్రతీరోజు మధ్యాహ్నం 3నుంచి 6గంటల వరకు తెరచి ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ప్రతీ నెల గ్రంథాలయానికి వచ్చే విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రోత్సాహక బహుమతులు అందిస్తామని ప్రకటించారు. జేసీఐ చాప్టర్ ప్రెసిడెంట్ మాకిరెడ్డి వీఎన్ఎస్ పూర్ణిమ, ఆజాద్ ఫౌండేషన్ అధ్యక్షుడు యల్లమిల్లి నాగసుధాకొండలరావు పాల్గొని ఉపకార వేతనాలను అందించగా ట్రస్టు నిర్వాహకుడు ఆకొండి పవన్ పాల్గొన్నారు.

బీవీసీలో ముగిసిన ఐటీ నైపుణ్య కార్యశాల

అల్లవరం, ఆగస్టు 17: ఓడలరేవు బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో ఏపీ నైపుణ్య అభివృద్ధి సంస్థచే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ అండ్ మెషిన్ లెర్నింగ్ విభాగం ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ విద్యార్థులకు వారం రోజులు జరిగిన ప్రోగ్రామింగ్, ఐటీ నైపుణ్యాలపై వర్క్‌షాపు ముగిసింది. ఈసందర్భంగా విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఇటువంటి కార్యక్రమాలు పరిశ్రమ అవసరాలను గుర్తించి తోడ్పడతాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఎస్ఏ చంద్రమౌళి అన్నారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ కొత్తూరి లోవబాబు, కళాశాల సెక్రటరీ బోనం కనకయ్య, చైర్మన్ బోనం కృష్ణసతీష్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ప్రవీణ్, డాక్టర్ మీరాషరీఫ్, వివిధ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమావేశం

అంతర్వేది, ఆగస్టు 17: సఖినేటిపల్లి మండలం గీతా మందిరం హైస్కూలులో స్పోర్ట్స్ కాంప్లెక్సు నియోజకవర్గస్థాయి సమావేశాన్ని శనివారం నిర్వహించారు. సమావేశానికి విజిటింగ్ అధికారిగా జిల్లా సమగ్ర శిక్షా సీఎంవో బొరుసు సుబ్రహ్మణ్యం విచ్చేసి మాట్లాడారు. గీతామందిరం, మోరి హైస్కూలులో ఈసమావేశాలు నిర్వహించారు. విద్యా ప్రమాణాల పెంపు, టీఎల్ఎం గురించి అవగాహన కల్పించారు. సమావేశానికి హాజరైన ఉపాధ్యాయులకు మోడల్ లైసెన్సు, లైసెన్సు ప్లాన్ తయారీ ప్రదర్శన గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంఈవోలు బి.కిశోర్‌కుమార్, ఎంవెంకటేశ్వరరావు, రిసోర్స్ పర్సన్ కె.శ్రీదేవి, పి.శ్రీను, బాలకృష్ణ, చిట్టిబాబు, డిజిటల్ హెచ్‌ఎం వీరాస్వామి, సత్యనారాయణ పాల్గొన్నారు.

సూర్యనారాయణరెడ్డి సేవలు చిరస్మరణీయం

రాయవరం, ఆగస్టు 17: గ్రామీణ ప్రాంతంలో సాయితేజా విద్యా నికేతన్‌ను ఏర్పాటుచేసి విద్యాభివృద్ధికి కర్రి సూర్యనారాయణరెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని మండపేట, అనపర్తి ఎమ్మెల్యేలు వేగుళ్ల జోగేశ్వరరావు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం రాయవరం సాయితేజా స్కూల్‌లో స్కూల్ అధినేత సూర్యనారాయణరెడ్డి విగ్రహాన్ని ఎమ్మెల్యేలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సాయితేజా స్కూల్ అకడమిక్ డైరెక్టర్లు కర్రి భానురేఖా, కర్రి సందీప్‌రెడ్డి, ఎంపీపీ నౌడు వెంకటరమణ, ఎంఈవోలు పి.రామలక్ష్మణమూర్తి, వై.సూర్యనారాయణ, సర్పంచ్‌లు చంద్రమళ్ల రామకృష్ణ, చ్రాతాతి జానకి రాంబాబు, వైద్యులు టి.నవీన్‌రెడ్డి, గోపి రవితేజా, తేతలి సుబ్బిరామిరెడ్డి, ఏవో పోలిమాటి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శి ఆకులకు ఉత్తమ సేవా పురస్కారం



డీపీవో రాంబాబు నుంచి సేవాపురస్కారం అందుకుంటున్న దృశ్యం

మండపేట, ఆగస్టు 17: ద్వారపూడిలో పారిశుధ్యం మెరుగుతో పాటు సమస్యల పరిష్కారానికి చేస్తున్న కృషికి పంచాయతీ కార్యదర్శి ఆకుల వెంకటరమణకు ఉత్తమ సేవా పురస్కారం లభించింది. అమలాపురంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబు నుంచి ఆయన పురస్కారాన్ని అందుకున్నారు. జిల్లాలో 25మంది పంచాయతీ కార్యదర్శులు సేవా పురస్కారాలు అందుకున్నారు. కార్యదర్శి రమణను సహచర కార్యదర్శులు, ద్వారపూడి పంచాయతీ సిబ్బంది అభినందించారు.

రాజోలు సీఐగా నరేష్‌కుమార్

రాజోలు, ఆగస్టు 17: రాజోలు సీఐగా టి.వి.నరేష్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. అమలాపురం ఇంటిలిజెన్స్ నుంచి ఆచప బదిలీపై ఇక్కడకు వచ్చారు. శాంతిభద్రతలు పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ఆయనకు రాజోలు సర్పంచ్ రేవూ జ్యోతి, ఉపసర్పంచ్ పామర్తి రమణ, ఎస్ఐలు, ఏఎస్ఐలు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఎంపీ పరామర్శ

ఐ.పోలవరం, ఆగస్టు 17: సోదరుడి వియోగంతో బాధపడుతున్న ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, టీడీపీ నాయకుడు దాట్ల పృధ్వీరాజ్‌ను అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ శనివారం పరామర్శించారు. సీతారామరాజు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఎంపీ వెంట టీడీపీ యువ నాయకులు చెల్లి అశోక్, చెరుకూరి సాయిరామ్ ఉన్నారు.

పల్లంరాజుకు ప్రముఖుల పరామర్శ



సత్తిరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీ హరీష్‌మాధుర్ తదితరులు

అమలాపురం టౌన్, ఆగస్టు 17: టీడీపీ నాయకుడు, వ్యాపారవేత్త గంధం పల్లంరాజు తండ్రి సత్తిరాజు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. పితృవియోగంతో బాధపడుతున్న పల్లంరాజును శనివారం పలువురు నాయకులు పరామర్శించారు. గంధం సత్తిరాజు చిత్రపటానికి ఎంపీ గంటి హరీష్‌మాధుర్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు చిక్కాల గణేష్, అల్లాడి స్వామినాయుడు, చిక్కాల రాంబాబు, ఆశెట్టి ఆదిబాబు, చెల్లి అశోక్, చింతలపూడి సత్తిబాబు, గంధం శ్రీను పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలు పరిశీలించండి

అంబాజీపేట, ఆగస్టు 17: బూత్‌లెవెల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాపై పరిశీలన చేయాలని తహసీల్దార్ వెంకటేశ్వరి సూచించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈనెల 20నుంచి అక్టోబరు 18వరకు సర్వే నిర్వహించాలన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బూత్‌లెవెల్ అధికారులతో తహసీల్దార్ సమావేశం నిర్వహించారు. 18ఏళ్లునిండి ఉంటే ఓటు నమోదు, చనిపోయినా, ఇతర గ్రామాలకు వెళ్లినా, ఒకే ఇంటి నంబరుతో పదికి మించి ఓటర్లు ఉంటే, పేర్లు సవరణ వంటి వాటిని సరి చేయాలని సూచించారు. సమావేశంలో ఆర్ఐ ఇబ్రహీం, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఖతర్ పంపేందుకు నిరాకరించడంతో పుట్టింటికి వెళ్లిన భార్య

మనస్తాపంలో ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

కపిలేశ్వరపురం,ఆగస్టు17: కేదార్లంకలో ఉరి వేసుకుని వ్యక్తి మృతిచెందాడు. కేదార్లంక గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ కోనాల ఏడుకొండలు(43) శుక్రవారం రాత్రి తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడి భార్య ధనలక్ష్మి పనుల నిమిత్తం ఖతర్ దేశానికి వెళ్లి పది రోజుల క్రితం ఇక్కడకు వచ్చింది. ఆమెమళ్లీ కత్తర్‌కు వెళ్లాలనుకుంటున్నట్టు భర్తతో చెప్పింది. ఆమెను కత్తర్ పంపేందుకు ఇష్టంలేక పాస్‌పోర్ట్‌ను అతడు చింపేశాడు. దీంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. తీవ్ర మనస్తాపానికి గురైన ఏడుకొండలు ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతిచెందాడు. సంఘటనా స్థలాన్ని మండపేట రూరల్ ఎస్ఐ, అంగర ఇన్‌చార్జ్ ఎస్ఐ డి.సురేష్‌బాబు శనివారం పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

యువకుడి మృతదేహం లభ్యం

కె.గంగవరం, ఆగస్టు17: కోటిపల్లి గోదావరి నదిలో శుక్రవారం స్నానానికి దిగి గల్లంతైన కందుల నరేంద్ర మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు ఏఎస్ఐ కె.రాంబాబు చెప్పారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

పి.గన్నవరం, ఆగస్టు17: వ్యక్తి అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. బెల్లంపూడికి చెందిన ఆదిమూలం సూరిబాబు పాత ఇనుము వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల8న వ్యాపారం నిమిత్తం రాజోలు వైపు వెళ్లాడు. ఇంటికి తిరిగి రాకపోవడంతో అతడి మేనల్లుడు పోలీ సులకు ఫిర్యాదుచేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ బి.శివకృష్ణ తెలిపారు.

మనస్తాపంతో ఇంటి నుంచి అదృశ్యం

పి.గన్నవరం, ఆగస్టు 17: వ్యక్తి అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. లంకలగన్నవరానికి చెందిన పెదపూడి దుర్గాప్రసాద్(38)తో గొడవలు కారణంగా భార్య ఇద్దరు పిల్లలతో ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన దుర్గాప్రసాద్ లేఖ రాసి శనివారం ఇంట్లో నుంచి అదృశ్యమయ్యాడు. కేసు నమోదుచేసినట్టుఏఎస్ఐ పట్టాభి రామయ్య తెలిపారు.

అంగరలో ఉచిత వైద్య శిబిరం

కపిలేశ్వరపురం, ఆగస్టు 17: అంగర శ్రీవైభవ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద విశ్వమానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య నిపుణులు వైద్యసేవలందించారు. విశ్వమానవతా సంస్థ వ్యవస్థాపకుడు అల్లూరి శ్రీనివాస్ సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు పలువురు కొనియాడారు.

గెస్ట్ లెక్చరర్లకు దరఖాస్తు చేసుకోండి

అమలాపురంటౌన్, ఆగస్టు17: ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్ ఉత్తర్వుల మేరకు అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గెస్ట్ లెక్చరర్స్‌గా పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ కవల కోటిలింగం తెలిపారు. వృక్షశాస్త్రం, పౌరశాస్త్రం అధ్యాపకులుగా పనిచేసేందుకు ఈ నెల22వతేదీ సాయంత్రం5గంటలులోగా దరఖాస్తులుఅందించాలన్నారు. గెస్ట్ లెక్చరర్లకు నెలకు గౌరవవేతనంగా ప్రభుత్వం రూ.10వేలు చెల్లిస్తుందన్నారు.

నవోదయకు నేతాజీ స్కూల్ విద్యార్థిని ఎంపిక

ఆలమూరు,ఆగస్టు17: నవోదయలో ఉచితప్రవేశానికి రెండో విడతలో ఆలమూరు మండలం నేతాజీ స్కూల్ విద్యార్థి గంధం రిషికస్వరాణి ఎంపికైనట్టు స్కూల్ చైర్మన్ తుమ్మా శ్రీనివాస్ తెలిపారు. ఆమెను శనివారం పాఠశాల ఆవరణలో అభినందించారు. మొదటి విడతలో బడుగు జ్యోతిసత్యశ్రీ ఎంపికైంది. స్కూల్ ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు రికార్డు స్థాయిలో 21మంది విద్యార్థులు నవోదయకు ఎంపికయ్యారని శ్రీనివాస్ చెప్పారు.

24వరకు ఆధార్ శిబిరాలు

కపిలేశ్వరపురం, ఆగస్టు 17: గ్రామాల్లో ఈనెల20నుంచి 24 వరకూ ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కొండలరావు తెలిపారు. 20,21, 22తేదీల్లో తాతపూడి, 23, 24న కపిలేశ్వరపురం-2 సచివాలయంలో, 20,21న పడమరఖండ్రిక, కాలేరు, 22,23న కోరుమిల్లి-1, వడ్లమూరు, 24న కోరుమిల్లి-2, నేలటూరు సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తామన్నారు.